సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

బుధవారం । 28 । జూన్ । 2023



జీవ సాంకేతికతతో నూతన వంగడాలు

జీవ సాంకేతిక పరిజ్ఞానంతో నూతన వంగడాలను అభివృద్ధి చేసుకోవచ్చని కేయూ వీసీ తాటికొండ రమేశ్ అన్నారు. - 8లో ▸



ప్రైవేట్ పాఠశాల బస్సుల అడ్డగింత

రఘునాథపల్లి మండలం జాఫర్‌గూడెంలోని ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ ప్రైవేట్ పాఠశాల బస్సులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అడ్డుకున్నారు. - 8లో ▸

గరిష్టం/కనిష్టం
$29.0^0 / 25.0^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి రూరల్: టీఎస్ఎస్సీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ వద్ద సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పది నెలలు రెసిడెన్సియల్ (సీఎస్ఏటీ–2024) ఉచిత కోచింగ్ ప్రోగ్రాం కోసం జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ డిగ్రీ అర్హత గలవారు జూలై 2వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునీత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూలై 9వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

కలెక్టరేట్‌లో రిజిస్ట్రేషన్ కార్యాలయం



భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలో నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయనున్నారు. మూడు రోజుల క్రితం జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంజూరు చేస్తూ జీఓ జారీచేసిన విషయం తెలిసిందే. దీంతో మంగళవారం రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డీఐజీ సైదిరెడ్డి కలెక్టరేట్ కార్యాలయాన్ని పరిశీలించారు. జిల్లా మైనారిటీ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. జూలై 1వ తేదీ నుంచి జిల్లాలోనే రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభించనున్నట్లు సైదిరెడ్డి తెలిపారు. మూడు రోజుల్లో ఏర్పాట్లు పూర్తి చేస్తామని తెలిపారు.

గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ప్రభాకర్ గౌడ్



భూపాలపల్లి రూరల్: తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీపతి ప్రభాకర్‌గౌడ్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావు గౌడ్ మంగళవారం నియామక పత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీపతి ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్తులు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో అభివృద్ధి చెందే విధంగా అందరి సహకారంతో రాజకీయ పార్టీలకు అతీతంగా జిల్లాలో ఉన్న దాదాపు 50వేల మంది గౌడ కులస్తులను ఒకతాటి మీదికి తీసుకొని వచ్చే విధంగా ప్రయత్నం చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన గౌడ సంఘం పెద్దలు మొగుళ్ల అశోక్ గౌడ్, నాచగోని రాజయ్యగౌడ్, బత్తిని కీర్తి లతా గౌడ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆరుగురి రిమాండ్

మహదేవపూర్: మండలంలో పలు కేసుల్లో ఆరుగురు నిందితులను మంగళవారం రిమాండ్ చేసినట్టు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. సురారం గ్రామానికి చెందిన ఇరువురాళ్ల దుర్గమ్మ తన కొడుకు వెంకటేష్‌కు (చెట్లమందు) ఆకు పసరుతో విషప్రయోగం జరిగిందని కోడలు అంజలితో పాటు వారి అమ్మనాన్న తిరుపతమ్మ ,బలమల్లయ్యలపై ఫిర్యాదు చేసింది. దీంతో ముగ్గురిని పోలీసులు రిమాండ్ చేశారు. మరో కేసులో అవివాహితను లోబర్చుకుని గర్భవతిని చేసిన ఘటనలో మహిళ తండ్రి ఫిర్యాదు మేరకు అంబట్‌పల్లి గ్రామానికి చెందిన ప్రశాంత్‌పై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. కుదురుపల్లికి గ్రామానికి చెందిన లక్ష్మి ,రాజేశ్వరిపై అటవీశాఖ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

దాడి ఘటనలో ఆరుగురిపై..

చిట్యాల: భూ తగదాలతో రైతుపై దాడిచేసిన ఘటన మండలంలోని ముచినిపర్తి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ఎండీ.షాఖాన్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ముచినిపర్తి గ్రామానికి చెందిన రైతు అన్నెం అనిల్ కుమార్ రెడ్డికి చల్లగరిగ గ్రామానికి చెందిన తోనగర్ శంకర్‌సింగ్‌కు కొంతకాలంగా భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 17న అనిల్‌కుమార్‌రెడ్డిని చల్లగరిగ గ్రామానికి చెందిన తోనగర్ శంకర్‌సింగ్, తోనగర్ రాజేందర్ సింగ్, భామర్ జయ, భామర్ నివేద, తోనగర్ జ్యోతి, భామర్ దిలీప్ కలిసి కర్రలతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో బాధితుడి భార్య శ్రీలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఆరుగురిపై కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. దాడిచేసిన మరో వ్యక్తి భామర్ దిలీప్ పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

దీప్తా, కులసుందరి క్రమాల్లో అమ్మవారికి పూజలు

హన్మకొండ కల్చరల్ : భద్రకాళి దేవాలయంలో జరుగుతున్న శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు మంగళవారం ఉదయం అమ్మవారికి దీప్తా, కులసుందరి క్రమాల్లో పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ఉదయం నుంచి సుప్రభాతసేవ, నిత్యాహ్నికం చేశారు.

పట్టించుకోని సింగరేణి అధికారులు

మట్టి తరలింపునకు సింగరేణి అధికారుల నుంచి అనుమతులు తీసుకుంటున్నప్పటికీ అనుమతి తీసుకున్న ప్రాంతానికి మట్టిని తరలిస్తున్నారా లేదా వేరే ప్రాంతాలకు తరలిస్తున్నారా అని సింగరేణి సెక్యూరిటీ విభాగం అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. కానీ పట్టించుకోవడం లేదు. అనుమతి పొందిన పరిమితికి మించి కొంత మంది వ్యాపారులు అధికంగా తరలిస్తున్నట్లు సమాచారం. ఈ మట్టి దందాలో కొంత మంది సింగరేణి అధికారులు, సిబ్బంది వాటా కూడా ఉన్నట్లు తెలుస్తోంది.



వెంచర్లకు సింగరేణి మట్టి

పట్టించుకోని సంబంధిత అధికారులు

- సొమ్ము చేసుకుంటున్న నాయకులు
- నిబంధనలకు విరుద్ధంగా మట్టి సరఫరా

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియా ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్–2లోని మట్టిని కొంతమంది నాయకులు రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. అధికారుల నుంచి అనుమతులు తీసుకొని కొంతమంది అధికార పార్టీకి చెందిన నాయకులు, కార్మిక సంఘాల నాయకులు సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సింగరేణి అధికారులు విచ్చలవిడిగా అనుమతులిస్తూ సింగరేణి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

రియల్ ఎస్టేట్ వెంచర్లకు..

భూపాలపల్లి, మంజూర్‌నగర్, చెల్పూర్ ప్రాంతాల్లో వెంచర్లను ఏర్పాటు చేస్తున్నారు. బొందలు, కాల్వలు ఉన్న ప్రాంతాల్లో భూమిని చదును చేసేందుకు వందలాది సంఖ్యల లారీల మట్టి అవసరమవుతుండటంతో సింగరేణి ఓపెన్‌కాస్టులోని మట్టిని తరలిస్తున్నారు. బయటి ప్రాంతాల్లో మట్టిని కొనుగోలు చేసి చదును చేసేందుకు లక్షల రూపాయలు ఖర్చు వస్తుండటంతో వ్యాపారులు అధికార పార్టీ నాయకులు అండదండలతో సింగరేణి మట్టిని ఉపయోగిస్తున్నారు.

మట్టితో వ్యాపారం..

సింగరేణి మట్టితో కొంతమంది నాయకులు వ్యాపారం చేస్తున్నారు. వారితో పాటు జేసీబీ, లారీ యాజమాన్యాలు కూడా వ్యాపారం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఒక ట్రిప్పు లారీకి రూ.3నుంచి 4వేల వరకు మట్టిని అమ్ముతున్నట్లు సమాచారం. మట్టి తరలించేందుకు కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు అధికార పార్టీ నాయకులను ఆశ్రయిస్తుండటంతో వారు ప్రజాప్రతినిధులు లెటర్‌ప్యాడ్‌లు పెట్టి అనుమతులు తీసుకుంటున్నారు. తీసుకుంటున్న అనుమతులు కూడా ప్రభుత్వ నిర్మాణ అవసరాలు, ప్రభావిత గ్రామాల్లోని నూతన ఇంటి నిర్మాణాలకు, రోడ్డు ఏర్పాటు చేసేందుకు అంటూ సింగరేణి అధికారులు తప్పుడు సమాచారం ఇస్తున్నట్లు తెలిసింది. ఇదే అదునుగా భావించిన నాయకులు, వ్యాపారులు అందినకాడికి దండుకుంటున్నారు.

ఎన్నికలకు సన్నద్ధం..



ఏనుమాముల మార్కెట్ గోదాములో భద్రపరిచిన ఈవీఎం, వీవీ ప్యాట్లను పరిశీలిస్తున్న హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఏర్పాట్లలో అధికార యంత్రాంగం బిజీబిజీ

- ఈవీఎంలు పరిశీలన.. గోదాముల తనిఖీలు
- ఎన్నికల సంఘం సమావేశానికి హాజరైన కలెక్టర్లు
- ఢిల్లీలో సమావేశాలకు వెళ్లిన అడిషనల్ కలెక్టర్లు..
- త్వరలోనే జిల్లాలకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధులు

ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ఓటర్లు	
పురుషులు	13,78,380
మహిళలు	13,97,121
ఇతరులు	343

జిల్లాల వారీగా పోలింగ్ కేంద్రాలు	
హనుమకొండ	479
వరంగల్	766
జనగామ	857
జేఎస్ భూపాలపల్లి	317
మహబూబాబాద్	531
ములుగు	302

సాక్షిప్రతినిధి, వరంగల్: శాసనసభ సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సర్వసన్నద్ధమవుతోంది. ఓటర్ల ముసాయిదా, సవరణ, నమోదు మొదలు.. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లను సిద్ధం చేస్తున్నారు. అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికలకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఆయా పనుల్లో అధికారులు బిజీబిజీగా కనిపిస్తున్నారు. పది రోజుల క్రితం ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు కలెక్టర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. మూడు రోజులపాటు నిర్వహించిన ఎన్నికల నిర్వహణ శిక్షణకు జిల్లా అదనపు కలెక్టర్లు హాజరయ్యారు. 23, 24 తేదీల్లో సైతం హైదరాబాద్‌లో సమావేశాలు జరగ్గా.. కలెక్టర్లు, జిల్లా ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. పోలింగ్ బూత్ స్థాయి అధికారుల (పీబీఎల్‌ఓ)తో కలిసి ఓటర్ల జాబితాపై ప్రత్యేక సర్వే నిర్వహించారు. స్థానికంగా లేని ఓట్ల ఏరివేతను చేపట్టడంతోపాటు ఒకే ఇంటి నంబర్‌పై 10 నుంచి 110 వరకు ఓట్లు నమోదు కావడంపైనా ఆరా తీస్తున్నారు.

ఉమ్మడి వరంగల్‌లో 27,75,844 మంది ఓటర్లు...

ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా మొత్తం 27,75,844 మంది ఓటర్లు ఉన్నారు. జనవరి 5న వెల్లడించిన తుది జాబితాలో తప్పులు కుప్పలు తెప్పలుగా జరిగినట్లు గుర్తించిన అధికారులు.. వాటిని సవరించేందుకు చేపట్టిన వడబోత ముగింపునకు చేరింది. భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల సరిహద్దున మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు ఉండడంతో ఏటా పనుల నిమిత్తం వస్తున్న కూలీలు, బంధువులను ఓటరు జాబితాలో చేర్పించినట్లుగా గుర్తించి తొలగించారు. భూపాలపల్లిలో రెండు ఇంటినంబర్లపై 255, వరంగల్‌లో రెండింటిపై 212, హనుమకొండలో రెండింటిపై 274, ములుగులో ఒకే ఇంటిపై 110 ఓట్లుండటంపై వడబోసి సరి చేశారు. కాగా ఉమ్మడి వరంగల్‌లో మొత్తం 3,252 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. వాటిని పీబీఎల్‌ఓలు తనిఖీలు చేస్తున్నారు. ఈ మేరకు ఈవీఎంలను కూడా పరిశీలించిన కలెక్టర్లు, వాటిని నిల్వచేసిన గోదాములను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీలు చేశారు.

మాక్‌పోలింగ్‌కు ఏర్పాట్లు..

రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకప్ (ఎఫ్ఎల్‌సీ)లను నిర్వహిస్తున్నారు. కలెక్టర్ల పర్యవేక్షణలో ఉమ్మడి వరంగల్‌లో శనివారం నుంచి సోమవారం వరకు ఈ ఎఫ్ఎల్‌సీ కార్యక్రమాలు నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్.. ఏనుమాముల మార్కెట్ ఈవీఎం గోడౌన్‌లో ఫస్ట్ లెవల్ చెకప్ నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు, రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో గోడౌన్ తెరిచారు. ఫస్ట్ లెవెల్ చెక్ నిర్వహించారు. ఈవీఎంల తనిఖీల సందర్భంగా వాటిని పరిశీలించేందుకు ఇంజినీర్ల బృందాలు కూడా ఉమ్మడి జిల్లాలో తిరుగుతున్నాయి. ఈవీఎంల పరిశీలన, తనిఖీల తర్వాత ప్రతి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ ద్వారా మాక్ పోలింగ్ నిర్వహించేందుకు బృందాలు ఏర్పాట్లు చేశాయి. ఇదిలా ఉండగా త్వరలోనే కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధులు ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారని అధికారులు ప్రకటించారు. ఈ మేరకు అన్ని జిల్లాల్లో అధికారులు అప్రమత్తం అయ్యారు. ముందస్తుగా ఈవీఎంల పరిశీలన, గోదాముల తనిఖీలు, మాక్ పోలింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం.

పనులు త్వరగా పూర్తిచేయాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి

చిట్యాల: మండలంలోని 12 గ్రామపంచాయతీ భవనాల పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి కోరారు. మంగళవారం మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాలకు చెందిన సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలోని కాల్వపల్లి, అందుకుతండా, వెంచరామి, నైన్‌పాక, వరికోల్‌పల్లి, కొత్తపేట, లక్ష్మీపూర్‌తండా, జూకల్, చల్లగరిగ, గుంటూరుపల్లి, ఏలేటి రామయ్యపల్లి, కైలాపూర్ గ్రామ పంచాయతీ భవనాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఇంతవరకు కొన్ని పంచాయతీల్లో పనులు ప్రారంభించలేదని, మరికొన్నింట్లో పనులు జరుగుతున్నాయని చెప్పారు. మరింత వేగవంతంగా పనిచేయాలని అన్నారు. పనులు వేగంగా జరిగేలా చూడాలని మండల అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అనంతరం కొత్తపేట, నైన్‌పాక, వరికోల్‌పల్లి, ఏలేటి రామయ్యపల్లి, లక్ష్మీపూర్ తండా గ్రామాలలో పంచాయతీ భవన నిర్మాణ స్థలాలను ఆమె సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామయ్య, పీఆర్ ఏఈ రవికుమార్, ఏపీఓ హలీం పాషా, ఎంపీఓ రామకృష్ణ, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే రిజిస్ట్రేషన్



ఇంటి వద్ద రిజిస్ట్రేషన్ చేస్తున్న తహసీల్దార్

మల్హర్: అనారోగ్యంతో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్న ఓ రైతు ఇంటి వద్దకే మంగళవారం వెళ్లి తహసీల్దార్ శ్రీనివాస్ భూమి రిజిస్ట్రేషన్ చేశారు. వల్లెకుంట గ్రామానికి చెందిన లింగపల్లి కాంతరావుకు 5.27 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. తన నలుగురు కుమారులకు భూమిని రిజిస్ట్రేషన్ చేయడానికి కుటుంబసభ్యుల సహాయంతో మీసేవలో స్లాట్‌బుక్ చేసుకున్నాడు. కాంతరావు నడువలేని పరిస్థితి తెలుసుకున్న తహసీల్దార్ రిజిస్ట్రేషన్ సామగ్రితో పాటు ధరణి ఆపరేటర్ సంతోష్‌ను వెంట తీసుకెళ్లి ఆయన కుమారులకు స్లాట్‌లో కేటాయించిన విధంగా ఆయన ఇంట్లోనే రిజిస్ట్రేషన్ చేసి డాక్యుమెంట్ పత్రాలు అందించారు.

విద్యార్థులను అభినందించిన డీఈఓ



పాఠశాలలో కరాటే విద్యార్థులతో డీఈఓ

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని రంగయ్యపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు కార్తికేయ, అరుణ్ కుమార్ బాక్సింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించినందుకు గాను జిల్లా విద్యాశాఖ అధికారి రాంకుమార్ మంగళవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి బాక్సింగ్‌లో రంగయ్యపల్లి విద్యార్థులు మెడల్స్ సాధించడం ఆనందదాయకమన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు కరాటేను నేర్చుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, వ్యాయామ ఉపాధ్యాయులు రఘు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆర్‌బీఐ ఆదేశాల మేరకు ఎస్‌బీఐ బ్యాంక్ అధికారులు బ్లాక్ లెవల్ ఇండియా క్విజ్ ఆన్ ఫైనాన్షియల్ లిటరసీ 2023 పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం, తాడ్వాయి, మంగపేట, ఏటూరునాగారం మండలాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో రామన్నగూడెం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు గడబోయిన నవదీప్(పదో తరగతి), గార రక్షిత (9వ తరగతి)లు ప్రథమ స్థానంలో నిలిచారు. వీరికి ములుగు ఎస్‌బీఐ లీడ్‌బ్యాంక్ మేనేజర్ ఎల్‌డీఎం రాజ్‌కుమార్ ఒక్కొక్కరికి రూ.5వేల నగదుతో పాటు ప్రైజ్ మనీ, ప్రశంస పత్రాలను అందజేశారు. జూలై 4న ములుగులో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో వీరు ఇద్దరు పాల్గొంటారని రామన్నగూడెం జెడ్పీహెచ్ఎస్ హెడ్మాస్టర్ సూర్యానారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడ్జెట్ నిధులు పెంచాలి



స్వాగతం పలుకుతున్న స్థానిక నాయకులు

భూపాలపల్లి అర్బన్: ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచి కనీస సౌకర్యాలు కల్పించాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్(సీఐటీయూ) యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ నెల 16న ప్రారంభమైన అంగన్‌వాడీ ఉద్యోగుల రాష్ట్ర జీపు జాతా మంగళవారం భూపాలపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జయలక్ష్మి మాట్లాడారు. అంగన్‌వాడీ హెల్పర్లకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలన్నారు. పక్కా భవనాలు నిర్మించాలని.. పనిభారం తగ్గించాలని.. అధికారుల వేధింపులు ఆపాలని కోరారు. పర్మనెంట్ చేసి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించని పక్షంలో వచ్చేనెల 10వ తేదీన కలెక్టరేట్ల ముట్టడి చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు, నాయకులు జయప్రద, వెంకటమ్మ, సాయిలు, రమేష్, సత్యవాణి, పద్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడా పాఠశాల ప్రవేశాల వయోపరిమితి సవరణ

ములుగు: రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు 4, 5వ తరగతి విద్యార్థుల వయోపరిమితిని సవరించినట్లు జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటరమణాచారి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 4వ తరగతి ప్రవేశానికి అక్టోబర్ 1వ తేదీ 2014 నుంచి 31 ఆగస్టు 2015 వరకు, 5వ తరగతిలో ప్రవేశానికి అక్టోబర్ 1 తేదీ 2013 నుంచి ఆగస్టు 31వ తేదీ 2014 మధ్యలో జన్మించి ఉండాలని సూచించారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమేయాలి



మాట్లాడుతున్న రవికుమార్

భూపాలపల్లి అర్బన్: చేతి సంచులను వాడుతూ ప్లాస్టిక్ భూతాన్ని తరిమేయాలని డీజీఎం(సివిల్) రవికుమార్ విద్యార్థులకు సూచించారు. స్వచ్ఛతా పక్వాడాలో భాగంగా మంగళవారం ఏరియాలోని కృష్ణాకాలనీలో చెత్త తొలగించే కార్యక్రమం చేపట్టారు. అనంతరం సింగరేణి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దీంతో ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు జూట్ సంచులను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు శివకేశవరావు, రవి, కృష్ణప్రసాద్, శ్యామ్‌ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి

ఐటీడీఏ పీఓ అంకిత్



విద్యార్థులతో మాట్లాడుతున్న పీఓ అంకిత్

కాటారం: విద్యార్థులకు ఇబ్బందులు, అసౌకర్యాలు లేకుండా చూసుకోవాలని ఐటీడీఏ పీఓ అంకిత్ హెచ్ఎం, ఉపాధ్యాయులకు సూచించారు. కాటారం మండలం మేడిపల్లిలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను మంగళవారం పీఓ సందర్శించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు పట్టిక, సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల వివరాలపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యూనిఫాంలు, టెక్స్ట్‌బుక్స్, నోట్ బుక్స్, ఇతర మెటీరియల్స్ అందాయా లేదా అని ఆరా తీశారు. పాఠశాల భవనం మరమ్మతు పనుల పురోగతి, పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలపై హెచ్ఎంతో చర్చించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, రుచికరణమైన భోజనం అందించాలని నాణ్యత విషయంలో రాజీపడవద్దని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులతో ఫుడ్ కమిటీని ఏర్పాటుచేసి పర్యవేక్షణ జరిగేలా చూడాలని చెప్పారు. ఏఎన్ఎంను నియమించాలని ఉపాధ్యాయులు పీఓ దృష్టికి తీసుకెళ్లగా నెల రోజుల్లో ఏఎన్ఎంను ఏర్పాటు చేస్తామని ఆయన హామీఇచ్చారు. పీఓ వెంట పాఠశాల హెచ్ఎం దివ్యశ్రీ, ఉపాధ్యాయులు రమాదేవి, శిరీష, శైలజ, పూర్ణచంద్రశేఖర్, సంపత్, పురుషోత్తం ఉన్నారు.

సొంతపార్టీపైనే సర్పంచుల అసంతృప్తి



రహస్యంగా సమావేశమైన బీఆర్ఎస్ పార్టీ సర్పంచులు

ములుగు: సొంతపార్టీ అవలంబిస్తున్న తీరుపై బీఆర్ఎస్ సర్పంచులు తమ అసంతృప్తిని వెళ్లగక్కారు. జిల్లా కేంద్రంలో మంగళవారం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు భూక్య పాప పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్, నూనేటి సువర్ణసాంబయ్య, పోరిక రాంకుమార్, గుగులోత్ తిరుపతి, మోర రాజయ్య, సోమ పారిజాతం వెంకటస్వామి, గరిగె లలితనర్సింగరావు, బానోతు మంజులయాకునాయక్, మాలోతు రవీందర్, చందా కుమారస్వామి తదితరులు రహస్యంగా సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. పార్టీ తరఫున జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సంక్షేమ పథకాల విషయంలో తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వెలిబుచ్చినట్లుగా తెలుస్తోంది. బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ మరణాంతరం పార్టీలో విబేధాలు చోటుచేసుకున్నట్లుగా ప్రచారం సాగుతోంది. ఇందుకు అనుగుణంగా సర్పంచులు సమావేశమై ఒక నిర్ణయానికి రావడం నిదర్శనంగా తెలుస్తుంది. ఈ సమావేశంలో పార్టీ తరఫున అండగా నిలబడకపోతే వచ్చే ఎన్నికల్లో సహకరించేది లేదని కొంతమంది సర్పంచులు చెప్పినట్లు సమాచారం. ఇదే గనుక జరిగితే రాబోయే ఎన్నికల్లో అధికార పార్టీకి తీవ్రనష్టం జరిగే అవకాశం కనిపిస్తోంది. ఈ విషయం తెలుసుకున్న జిల్లా నాయకులు వారిని బుజ్జగించే పనిలో నిమగ్నమైనట్లుగా సమాచారం.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించాలి

హన్మకొండ: విద్యుత్ ప్రమాదాలపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు అన్నారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఎన్పీడీసీఎల్ పరిధిలోని జిల్లాల ఎస్ఈలు, డీఈలు, ఎస్ఏఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలు లేకుండా చూడాలని సూచించారు. బ్రేక్ డౌన్స్, ట్రిప్పింగ్స్ లేకుండా చూడాలని ఆదేశించారు. గిరి వికాసంలో దరఖాస్తు చేసుకున్న సర్వీస్‌లను వెంటనే మంజూరు చేయాలన్నారు. డైరెక్టర్ బి.వెంకటేశ్వర రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్ రెడ్డి, వి.తిరుపతి రెడ్డి, సీజీఎంలు అశోక్ కుమార్, సదర్ లాల్, కిషన్, బీకంసింగ్, రాజ్ చౌహన్, డీఈ(ఐటీ) అనిల్ కుమార్ పాల్గొన్నారు.

రైలులో మరిచిపోయిన బ్యాగు అప్పగింత

కాజీపేట రూరల్ : రైలులో ప్రయాణికురాలు మరిచిపోయిన బ్యాగును ఆర్పీఎఫ్ పోలీసులు మంగళవారం అప్పగించారు. కాజీపేట ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు కథనం ప్రకారం.. వరంగల్‌కు చెందిన ప్రియాంక ఆంధ్రప్రదేశ్‌లోని ఎలమంచిలి నుంచి విశాఖపట్టణం–హైదరాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో వరంగల్‌కు చేరుకుంది. ఆమె రైలు దిగుతూ బ్యాగును మరిచిపోయింది. అప్పటికే రైలు కదిలి కాజీపేట వైపు వెళ్లింది. ఆ బ్యాగులో రూ.65,000 నగదు, 10 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నాయి. వెంటనే ఆమె వరంగల్ ఆర్పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ నర్మదకు ఫిర్యాదు చేసింది. ఆమె కాజీపేట ఆర్పీఎఫ్ సిబ్బందిని అప్రమత్తం చేసింది. రైలు కాజీపేటకు చేరుకోగానే ఆర్పీఎఫ్ సిబ్బంది కోచ్‌లోకి వెళ్లి వెతికి బ్యాగును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ప్రియాంక కుటుంబ సభ్యులను పిలిపించి నగదు, బంగారంతో బ్యాగును ఆర్పీఎఫ్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

FLAT FOR SALE

■ KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్, అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666 / 8309035091. [WA-27123]

HOUSE FOR SALE

■ ములుగురోడ్డు, కాకతీయ కెనాల్, కన్నెమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1 తో గల Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27120]

■ వరంగల్ రంగశాయిపేట శేషాద్రి హిల్స్‌లో E/F తో గల డీలక్స్ Ready to Occupy. 2 BHK House అమ్మకానికి కలదు. సెల్: 7660008666 / 8309035091 [WA-27117]

■ ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666 / 8309035091 [WA-27114]

■ GWMC అప్రూవ్డ్ లే అవుట్ చింతగట్టు హన్మకొండలో విల్లా ప్లాట్లు 4BHK డూప్లెక్స్ హౌజ్స్ 3BHK ఇండిపెండెంట్ హౌజింగ్ ప్రాజెక్ట్‌లో బుకింగ్ ప్రారంభమైనవి. శ్రీనివాస్. సెల్: 8978638094. [W-785618]

SERVICES

CHANGE OF NAME

■ I, Naveen Goduya, S/o. Goduya Mallikarjun (Old Names), R/o. H.No. 13-95/B, West Kamala Nagar Colony, Medipally, Ghatkesar Medchal Malkajgiri District-500098, T.S., have changed my name and father's name to NAVEEN GODUGU, S/o. Mallikarjun Godugu (New Names) for all future purposes. [W-785668]

నాటు కోళ్ళు పెంచండి...!

■ స్వచ్ఛమైన నాటుకోడి పిల్లలు అసీల్, టర్కి, సీమ కోళ్ళు పెంచండి. వివరాలకు సంప్ర॥ SV Agro Farm, హంటర్ రోడ్, వరంగల్. సెల్: 9959426718. [W-785666]

CAFE FOR SALE

■ Own your Dream Cafe for sale in Prime Location, Fully equipped, loyal Customer base, Seize the opportunity today. Cont: 7065002820. [W-785667]

LOANS

■ సిరి అసోసియేట్స్: హౌజ్, ఫ్లాట్, ఓపెన్ ప్లాట్, ల్యాండ్, వ్యవసాయ భూమి, వ్యక్తిగత, ఏ ప్రాపర్టీ అయినా మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. సెల్: 9666142226. [W-785652]

■ హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్-WGL 9618767116 [W-785592]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

OLD AGE HOME

■ మీన్స్ వృద్ధుల సేవా సంస్థ నందు వృద్ధులకు, బెడ్ పేషెంట్స్‌కు, దీర్ఘవ్యాధులలో ఉన్నా వారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24 గం॥ వైద్య, భోజనం, వసతి. ECIL, Hyd. సంప్ర: 9949520296/7981467036/6281127224. [H-781637]

WANTED

■ హన్మకొండ, వరంగల్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. వివరాలకు వెంటనే సంప్రదించండి. సెల్: 9703637320. [W-785658]

■ ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డు రాయుటకు స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000/-. ఫోన్ : 70756 56208 [V-6172]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను, ఫ్రీ వసతి+భోజనం, జీ: 18K ఏజెంట్స్ కమీషన్ 6K ఫోన్ : 9640258899 [H-793448]

■ ఆదాయం కోసం ఎదురు చూస్తున్నారా! నిరుద్యోగులకు ఉపాధి (పెట్టుబడి లేదు) స్వచ్ఛంద సేవా సంస్థనందు క్రౌడ్ ఫండింగ్ చేయుటకు జిల్లా కో-ఆర్డినేటర్ స్త్రీ/పు కావలెను. వీక్లీ 10K. 81439 09459. [M-1221327]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9010144453
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

జీవ సాంకేతిక పరిజ్ఞానంతో నూతన వంగడాలు



వీసీ తాటికొండ రమేశ్

- కేయూలో ప్రారంభమైన అంతర్జాతీయ కాన్ఫరెన్స్





మాట్లాడుతున్న వీసీ తాటికొండ రమేశ్, ప్రొఫెసర్ శ్రీనివాసన్ చంద్రసేగరాన్

కేయూ క్యాంపస్: జీవ సాంకేతిక పరిజ్ఞానంతో నూతన వంగడాలను అభివృద్ధి చేసుకోవచ్చని, హరిత విప్లవానికి కూడా ప్లాంట్ జీనోమ్ ఎడిటింగ్ దోహదం చేస్తుందని కాకతీయ యూనివర్సిటీ వీసీ తాటికొండ రమేశ్ అన్నారు. కేయూలో బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో యూకేలోని అబెర్సిత్ యూనివర్సిటీ వెల్స్, యూకే కొలబరేషన్‌తో 'ప్లాంట్ బయోటెక్నాలజీ అండ్ జెనోమ్ ఎడిటింగ్' అనే అంశంపై మూడురోజులు నిర్వహించనున్న అంతర్జాతీయ కాన్ఫరెన్స్ మంగళవారం క్యాంపస్‌లోని సెనేట్‌హాల్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార ఉత్పత్తులు కూడా అవసరమేనన్నారు. భారతదేశంలో హరితవిప్లవం ద్వారా ఆహార కొరత తీరిందన్నారు. జన్యుసవరణతో నూతనవంగడాల ఉత్పత్తి పెరుగుదల సాధ్యమన్నారు. కేయూ బయోటెక్నాలజీ విభాగం పరిశోధనల పరంగా ముందుకు సాగుతోందన్నారు. హైదరాబాద్ ఐసీఏఆర్ ఐఐఆర్ఆర్ డైరెక్టర్ ఆర్ఎం సుందరం మాట్లాడుతూ హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ అగ్రికల్చరల్ యూనివర్సిటీలో ఆధునిక సాంకేతిక పరిశోధనల ద్వారా జీనోమ్ ఎడిటింగ్ పద్ధతుల్లో నూతన వరి వంగడాలను కూడా సృష్టించారని, అవి త్వరలోనే మార్కెట్‌లోకి రాబోతున్నాయన్నారు. ఈసదస్సుకు బయోటెక్నాలజీ విభాగం అడ్జెంట్ ఆచార్యుడు రామస్వామి అధ్యక్షత వహించారు.

జన్యువుల సవరణతో విప్లవాత్మక మార్పులు

మొక్కలలో జన్యుల సవరణ(జీనోమ్‌ఎడిటింగ్) ద్వారా విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని యూఎస్‌ఏలో జాన్‌హప్ కిన్స్ వర్సిటీ ప్రొఫెసర్ శ్రీనివాసన్ చంద్రసేగరాన్ అన్నారు. ఈ సదస్సులో ఆయన 'జీనోమ్‌ఎడిటింగ్ రెవల్యూషన్స్ ఇన్‌లైఫ్ సైన్స్' అనే అంశంపై కీలక ఉపన్యాసం చేశారు. అనంతరం ఈ సదస్సు చైర్మన్, కేయూ బయోటెక్నాలజీ అడ్జెంట్ ప్రొఫెసర్ సదానందం, విదేశీ సైంటిస్టులు ఆస్ట్రేలియా మర్డోక్ యూనివర్సిటీ ఎస్ఏబీసీ ప్రొఫెసర్ ఎంజీకె జోన్స్, యూకేలోని అబెర్విసిత్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లూయిస్‌మూర్, అదే యూనివర్సిటీ ప్రొఫెసర్ డైలన్‌ఫిలిప్స్, అదే యూనివర్సిటీ ప్రొఫెసర్ హవ్యాజోన్స్, కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, మలేషియా మలియా యూనివర్సిటీ ప్రొఫెసర్ జెన్నిఫర్‌ఆనవారికృష్ణ, సింగపూర్ నేషనల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రకాశ్ పి కుమార్, కేయూ బయోటెక్నాలజీ విభాగం అడ్జెంట్ ప్రొఫెసర్ ఎస్ రామస్వామి మాట్లాడారు. కేయూ బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఏవి రావు , పి శ్రీనివాస్, శాస్త్రి ,అడ్జెంట్ ప్రొఫెసర్ క్రిష్టఫర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అతిథులు.. ప్లాంట్ బయోటెక్నాలజీ జీనోమ్ ఎడిటింగ్ సావనీర్‌ను ఆవిష్కరించారు.

ప్లీనరీ లెక్చర్స్..

అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో ప్లీనర్ లెక్చర్స్ జరుగుతున్నాయి. ఒక్కొక్క ప్లీనరీలో ముగ్గురు ఉపన్యాసం ఇస్తారు. ఇందులో భాగంగా మొదటి రోజు 40 మంది వివిధ అంశాలపై పోస్టర్లను సమర్పించారు. ప్రొఫెసర్లు త్యాగి, డేనియల్ ఫిలిఫ్స్, ఈవి సిరెఖినా, హెటెంద్రకుమార్‌పటేల్, సుందరం, డాక్టర్ రాహుల్‌కుమార్, వివిధ టెక్నికల్ సెషన్లలతో ప్రసంగించారు.

విదేశీ, స్వదేశీ యూనివర్సిటీల నుంచి రాక

మూడురోజులపాటు జరిగే అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో 'ప్లాంట్స్ బయోటెక్నాలజీ జీనోమ్ ఎడిటింగ్'పై 120 పరిశోధన పత్రాలు సమర్పించబోతున్నారు. విదేశీయులతోపాటు దేశంలోని వివిధ యూనివర్సిటీలనుంచి పరిశోధకులు వచ్చారు. వీరు 28,29 తేదీల్లో కూడా పరిశోధన పత్రాలు సమర్పిస్తారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రమేశ్, విదేశీ సైంటిస్టులు



హాజరైన ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు

చికిత్స పొందుతున్న రాజశ్రీ మృతి

- కారు, టిప్పర్ ఘటనలో ఐదుకు చేరిన మృతుల సంఖ్య



రాజశ్రీ(ఫైల్)

ఎంజీఎం: ఆత్మకూర్ మండలంలోని కటాక్షపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలై చికిత్స పొందుతున్న అనుమాల రాజశ్రీ (50) మృతి చెందినట్లు ఎంజీఎం వైద్యులు తెలిపారు. దీంతో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. గత ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వరంగల్ అబ్బనికుంటకు చెందిన వెల్దండి సాంబరాజు (40) అనుమాల నర్సింహాస్వామి(52), వెల్దండి ఆకాంక్ష (26) వెల్దండి లక్ష్మీప్రసన్న (9) అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రగాయాలపాలైన అనుమాల రాజశ్రీ, హర్షితను ఎంజీఎంకు తరలించారు. హర్షిత ఆరోగ్యం మెరుగుపడడంతో ఆమెను డిశ్చార్జ్ చేశారు. తలకు తీవ్రగాయాలై శ్వాస తీసుకోవడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న రాజశ్రీకి వెంటిలేటర్ ద్వారా మూడు రోజుల నుంచి చికిత్స అందిస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఆమె ఆరోగ్య పరిస్థితి మరింత విషమంగా మారి మృతి చెందినట్లు ఎంజీఎం వైద్యులు పేర్కొన్నారు.

పుట్టిన రోజు ముందురోజే..

కాశిబుగ్గ: రాజశ్రీ 50వ పుట్టిన రోజు బుధవారం. ఒకరోజు ముందు మృతిచెందడంతో బంధువుల రోదనలు మిన్నంటాయి. గతంలో జరిగిన ప్రమాదంలో ప్రాణాపాయంనుంచి బయటపడిన రాజశ్రీ.. ఈసారి మాత్రం తప్పించుకోలేకపోయిందంటూ బోరున విలపించారు.

కొరిశ చెక్క రసం తాగి వృద్ధుడు..

కన్నాయిగూడెం : కొరిశ చెక్క రసం తాగిన ఓ వృద్ధుడు.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని బుట్టాయిగూడెంలో జరిగింది. ఎస్సై సురేశ్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన కుమ్మరి లస్మయ్య (70)ను భార్య సమ్మక్క పెన్షన్ డబ్బు ఇవ్వమని కోరింది. దీంతో నన్ను డబ్బులు అడుగుతావా అంటూ మనస్తాపానికి గురై ఈ నెల 24వ తేదీన అడవికి వెళ్లి కొరిశ చెక్క రసం తాగాడు. లస్మయ్య ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కొడుకులు.. అడవిలో వెతకగా కొరిశ చెక్క రసం తాగి కనిపించాడు. వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

మురుగు కాలువలో శిశువు మృతదేహం లభ్యం

- ముల్కనూర్‌లో ఘటన
- పోలీసుల విచారణ

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని మత్స్య సహకార సంఘం వెనుక గల కాలనీలోని మురుగు కాలువలో మంగళవారం ఓ పసికందు మృతదేహం లభ్యమైంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం గుర్తు తెలియని మహిళ ఐదు నెలల పసికందును మురుగు కాలువలో పడేసి వెళ్లింది. శిశువుకు పూర్తిస్థాయిలో శరీర భాగాలు సైతం ఏర్పడలేదు. నెలలు నిండకముందే డెలివరీ కావడంతో మృతి చెందిన శిశువును మురుగుకాల్వలో వేశారు. దీంతో శిశువు మృతదేహాన్ని బయటకు తీసి వరంగల్ ఎంజీఎంకు తరలించి కాలనీలో అనుమానితులను విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైల్వే ట్రాక్‌పై మహిళ ఆత్మహత్య

కాజీపేట రూరల్ : మంచిర్యాల జిల్లా మందమర్రి రైల్వే ట్రాక్‌పై మంగళవారం ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. కాజీపేట జీఆర్పీ సీఐ రామ్మూర్తి కథనం ప్రకారం.. కాజీపేట వెంకటాద్రినగర్‌కు చెందిన స్వర్ణ సీమహానంద్.. రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. మృతదేహం వద్ద ఎన్నికల గుర్తింపు కార్డుతోపాటు తన చావుకు భర్త రాజ్‌మహానంద్ కారణం అని రాసిన ఓ సూసైడ్ నోట్ లభించింది. మృతురాలి వద్ద లభించిన చిరునామా ప్రకారం అక్కడికి పోలీసులను పంపించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ సీఐ తెలిపారు.

భూ ఆక్రమణపై విచారణ వేగవంతం..



కబ్జాకు గురైన దారిని పరిశీలిస్తున్న ఏసీపీ కిషన్, సీఐ శ్రీనివాస్

సాక్షి స్పందన

ఖిలా వరంగల్: వరంగల్ దూపకుంట రోడ్డులో జరిగిన భూ ఆక్రమణపై పోలీసులు విచారణ వేగవంతం చేశారు. మంగళవారం 'సాక్షి'లో 'తిరకాసు ..' 'ఒకే స్థలం.. రెండు సార్లు రిజిస్ట్రేషన్' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి సీపీ రంగనాథ్ ఆదేశాలతో ఏసీపీ బోనాల కిషన్ మంగళవారం వెంటనే స్పందించారు. ఖిలా వరంగల్ శివారు దూపకుంట రోడ్డులోని సర్వే నంబర్ 1372 న్యూ (831)లో ఆక్రమణకు గురైన స్థలాన్ని సీఐ శ్రీనివాస్, ఎస్సై సాంబయ్య, సిబ్బందితో కలిసి సందర్శించారు.ఆక్రమణకు గురైన స్థలంతోపాటు ఇరువురి డాక్యుమెంట్‌ను ఏసీపీ క్షుణ్ణంగా పరిశీలించారు. భూ ఆక్రమణదారులు దారికి అడ్డంగా తీసిన గొయ్యిని పరిశీలించారు. అనంతరం ఇరువురి నుంచి వివరాలు సేకరించారు. త్వరితగతిన విచారణ చేపట్టి సీపీకి నివేదిక అందజేస్తామన్నారు. సీపీ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామని ఏసీపీ పేర్కొన్నారు.

అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు



హన్మకొండ: తమిళనాడులోని అరుణాచలంకు టీఎస్ ఆర్టీసీ బస్సు నడుపుతున్నట్లు వరంగల్ రీజినల్ మేనేజర్ జె.శ్రీలత తెలిపారు. జూలై 3న గురుపౌర్ణమి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం అరుణాచలంకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నడుపనున్నట్లు ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు జూలై 1న రాత్రి 10 గంటలకు హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్ నుంచి బయలుదేరుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకంలోని విఘ్నేశ్వరుడి దర్శనానంతరం జూలై 2వ తేదీన రాత్రి 10 గంటలకు అరుణాచలం చేరుకుంటుందన్నారు. అరుణాచలేశ్వర స్వామి గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత జూలై 3 రాత్రి 8 గంటలకు అరుణాచలంలో బయలుదేరి వెల్లూరులోని గోల్డెన్ టెంపుల్, శ్రీ మహాలక్ష్మి అమ్మవారి సన్నిధికి వెళ్తుందని, ఇక్కడ దర్శనానంతరం బయలుదేరి జూలై 4న హనుమకొండకు చేరుకుంటుందన్నారు. అరుణాచలం గిరి ప్రదక్షిణ టూర్ ప్యాకేజీ ఒక్కరికి టికెట్ ధర రూ.4 వేలు నిర్ణయించినట్లు తెలిపారు. గిరిప్రదక్షిణకు వెళ్లే భక్తులు టీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్, ఆర్టీసీ బుకింగ్ కౌంటర్‌లోనూ ముందస్తు రిజర్వేషన్ చేసుకోవాలన్నారు. ఈ టూర్ ప్యాకేజీకి సంబంధించి పూర్తి సమాచారం కోసం 9494107944, 9959226047, 9959226048 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు. భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు.

ప్రైవేట్ పాఠశాల బస్సుల అడ్డగింత..

- ప్రభుత్వ పాఠశాలలో చేరిన విద్యార్థులు



ప్రైవేట్ పాఠశాల బస్సును అడ్డుకుంటున్న హెచ్ఎం, స్థానికులు

రఘునాథపల్లి: మండలంలోని జాఫర్‌గూడెంలో ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఎస్ఎంసీ చైర్మన్ తల్లిదండ్రులను ఒప్పించి మూడు రోజుల నుంచి పలువురు విద్యార్థులను స్వగ్రామంలోని పాఠశాలలో చేర్పిస్తున్నారు. అయినా కొందరు విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం గ్రామానికి వచ్చిన ప్రైవేట్ పాఠశాల బస్సులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామ ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులకు, కేవలం 8 మంది విద్యార్థులే ఉన్నారు. పాఠశాల మూసి వేసే అవకాశం ఉండడంతో హెచ్ఎం, సర్పంచ్, ఉప సర్పంచ్ ప్రత్యేక సమావేశం నిర్వహించి గ్రామంలోని 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులను గ్రామ బడిలో చేర్పించాలని నిర్ణయించారు. గ్రామానికి వచ్చిన ప్రైవేట్ పాఠశాలల బస్సులను నిలిపి 5వ తరగతి లోపు విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించి స్వగ్రామ పాఠశాలలో చేర్పిస్తున్నారు. దీంతో విద్యార్థుల సంఖ్య మంగళవారం నాటికి 41 మందికి చేరింది. కార్యక్రమంలో హెచ్ఎం కైలాసం, సర్పంచ్ శాగ సునీతరాజు, ఉప సర్పంచ్ స్వప్న, పంచాయతీ కార్యదర్శి మధు తదితరులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

- భర్త గొంతు నులిమి చంపిన భార్య అరెస్టు

వరంగల్: తన వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని భర్తను గొంతునులిమి చంపిన భార్యను, ఆమెకు సహకరించిన ప్రియుడిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ 3వ డివిజన్ పైడిపల్లి పరిధిలోని ఆర్ఎస్ఆర్‌నగర్‌కు చెందిన బట్టు వెంకన్నను తన భార్య స్వప్న.. ప్రియుడు ప్రశాంత్ సహకారంతో ఏప్రిల్ 21న చంపింది. తన అన్న వెంకన్న అనుమానాస్పదంగా మృతి చెందాడని తమ్ముడు లక్ష్మణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు.. పోస్టుమార్టం నివేదికలో వెంకన్న గొంతు నులమడంతో చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించడంతో కేసును హత్యగా నమోదు చేశారు. వెంకన్న భార్య బట్టు స్వప్న పరారీలో ఉండడంతో ప్రత్యేక టీమును ఏర్పాటు చేయడంతో అమెను, సహకరించిన ప్రశాంత్‌లను మంగళవారం ఏనుమాములో పట్టుకున్నారు. వారిని విచారించగా స్వప్నకు అదే కాలనీలో నివాసం ఉండే ఆటో డ్రైవర్ లావుడ్య ప్రశాంత్‌తో పరిచయం ఏర్పడి ఆ పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారితీసిందని వెల్లడైంది. ఈక్రమంలో స్వప్న ప్రశాంత్‌లు సన్నిహితంగా ఉండడం కాలనీవాసుల ద్వారా భర్త వెంకన్నకు తెలిసింది. దీంతో స్వప్నను మందలించడంతో భార్యాభర్తల నడుమ పలుమార్లు గొడవలు కూడా జరిగాయి. స్వప్న..ప్రియుడు ప్రశాంత్ దృష్టికి తీసుకెళ్లగా వెంకన్నను చంపేందుకు పథకం పన్నారు. ఏప్రిల్ 21న వెంకన్న మద్యం తాగి వచ్చి భార్య స్వప్నతో గొడవపడ్డాడు. ఆ తరువాత అన్నం తిని పడుకోగా, సుమారు అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో స్వప్న.. ప్రశాంత్‌కు ఫోన్ చేసి చెప్పగా.. ఎన్ని రోజులు భరిస్తావు..నేను ఉన్నాను. ఎలాగైనా వాడిని అంతం చేయమని చెప్పాడు. దీంతో స్వప్న పడుకున్న భర్త గొంతు నులిమి చంపింది. ఈ మేరకు స్వప్న, ప్రశాంత్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

గిరిజన గురుకుల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

- ఇద్దరు జూనియర్ అసిస్టెంట్ల తొలగింపు

కేసముద్రం: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ శైలజారాణిని సస్పెండ్ చేస్తూ, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు శ్రీను, విజయ్‌ని విధుల నుంచి తొలగించినట్లు ఆర్‌సీవో రాజ్యలక్ష్మి తెలిపారు. నిత్యావసరాలు సరఫరా చేస్తున్న నర్సంపేట జీసీసీ ఖాతాలో జమ కావాల్సిన సుమారు రూ.16 లక్షలు, ఓ ప్రైవేట్ వ్యక్తి ఖాతాలో జమ అయిన ఘటనపై విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందించినట్లు ఆమె తెలిపారు. ఈ మేరకు గురుకులాల కార్యదర్శి రోనాల్డ్‌రోస్, గిరిజన గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేస్తూ, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆర్‌సీవో తెలిపారు.

కేయూలో కాంట్రాక్ట్ లెక్చరర్..

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో కాంట్రాక్ట్ లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్న జె.జేత్యను సస్పెండ్ చేస్తూ మంగళవారం కేయూ రిజిస్ట్రార్ పి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఓ కేసు విషయంలో జేత్యను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు కథనాలు ప్రచురితమైన నేపథ్యంలో జేత్యను సస్పెండ్ చేసినట్లు రిజిస్ట్రార్ శ్రీనివాసరావు తెలిపారు.

రేపు అర్చకులకు అవగాహన

హన్మకొండ కల్చరల్: వరంగల్ జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ, ధూపదీపనైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో వరంగల్‌జోన్‌లోని కరీంనగర్, ఖమ్మం , వరంగల్,ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల 6ఏ, 6బీ, 6సీ దేవాలయాల అర్చకులు, ధూపదీపనైవేద్య అర్చకులకు ఈ నెల 29న ఆత్మీయ సమ్మేళనం, అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని అర్చక ఉద్యోగ జాక్ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల వరకు లష్కర్‌బజార్‌లోని టీటీడీ కల్యాణమండపంలో సదస్సు జరుగుతుందని, ప్రముఖ వేదపండితులు.. అర్చకులకు ఆగమాలపై అవగాహన కల్పిస్తారన్నారు. అర్చకులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

- హనుమకొండ బస్టాండ్‌లో పట్టుకున్న కళాశాల సిబ్బంది

కాటారం: కాటారం మండలం దామెరకుంటలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల నుంచి ఇంటర్ విద్యార్థిని అదృశ్యమై హనుమకొండ బస్టాండ్‌లో కనిపించింది. మహబూబాబాద్‌కి చెందిన ఓ విద్యార్థిని స్థానిక కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ పొందింది. ఈ నెల 19న కళాశాలకు వచ్చి జాయిన్ అయింది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం బహిర్భూమికని మరుగుదొడ్ల వద్దకు వెళ్లిన సదరు విద్యార్థిని.. ప్రహరీ దూకి బయటకు వెళ్లింది. ఈ విషయం ఆలస్యంగా గుర్తించి కళాశాల సిబ్బంది విద్యార్థిని గురించి ఆరా తీయగా ఆచూకీ లభించకపోవడంతో పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం హనుమకొండ బస్టాండ్‌కు వెళ్లగా అక్కడ విద్యార్థిని కనిపించింది. దీంతో తల్లిదండ్రులకు సమాచారం అందించి విద్యార్థిని అప్పగించారు. కాగా, కళాశాల ప్రహరీ దూకి.. విద్యార్థిని బయటకు వెళ్లే వరకూ కళాశాల సిబ్బంది గమనించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై ప్రిన్సిపాల్ మైథిలిని వివరణ కోరగా విద్యార్థిని కళాశాల నుంచి బయటకు వెళ్లిన విషయం వాస్తవమే అన్నారు. సదరు విద్యార్థిని కళాశాలకు వచ్చినప్పటి నుంచి అనాసక్తితోనే ఉందని తెలిపారు.

త్వరలో కిటెక్స్ కంపెనీ ప్రారంభం



సాక్షి, వరంగల్: వరంగల్ జిల్లా గీసుకొండ–సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ మరోసారి వార్తల్లో నిలిచింది. 1,350 ఎకరాల విస్తీర్ణంలోని ఈ మెగా పార్కులో నిర్మించిన కిటెక్స్ కంపెనీ కార్యాలయాలతో కూడిన ఫొటోలను రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ మంగళవారం ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. సీఎం కేసీఆర్ దీనిని రానున్న రెండు నెలల్లో ప్రారంభించనున్నారని పేర్కొన్నారు.

పోలీసుల కస్టడీకి ముగ్గురు..

- వరంగల్ ఎస్సీ, ఎస్టీ కోర్టు తీర్పు
- నేడు, రేపు విచారణ



జనగామ: బచ్చన్నపేట మండలం పోచన్నపేటకు చెందిన రిటైర్డ్ ఎంపీడీవో రామకృష్ణయ్య హత్య కేసులో ప్రధాన నిందితుడిగా, జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న గిరబోయిన అంజయ్యతో పాటు మరో ఇద్దరిని రెండు రోజులు పోలీసు కస్టడీకి అనుమతిస్తూ వరంగల్ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి మనీషా మెహ్రా మంగళవారం తీర్పు వెలువరించారు. ఈ మేరకు వెస్ట్ జోన్ డీసీపీ సీతారాం వెల్లడించారు. కేసు విషయంలో మరిన్ని విషయాలు తెలుసుకునేందుకు అంజయ్య, మిగతా ఇద్దరిని కస్టడీకి కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. నాలుగు రోజుల వాదోపవాదాల అనంతరం, ఎస్సీ, ఎస్టీ కోర్టు.. నిందితులను రెండు రోజులు పోలీసు కస్టడీకి అప్పగిస్తూ తీర్పు వెలువరించింది. కోర్టు ఆదేశాలను అనుసరించి నేడు (బధవారం) ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ నేతృత్వంలో అంజయ్య, మిగతా ఇద్దరు నిందితులను కస్టడీలోకి తీసుకోనున్నారు. రెండు రోజుల విచారణ అనంతరం ముగ్గురిని కోర్టులో అప్పగించాల్సి ఉంటుంది.